బిజీగా ఉన్నా.. తొక్కు మాత్రం పెట్టాల్సిందే..

రంగారెడ్డి, మే 23(నమస్తే తెలంగాణ): రాజకీయాల్లో నిత్యం బిజీగా ఉండే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం శ్రీనగర్‌లోని తన నివాసంలో సోదరి, మనవడితో కలిసి మామిడికాయ తొక్కు పెట్టారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

పాఠశాలల్లో పనులను వేగంగా చేపట్టాలి

వాసుదేవ్‌పూర్, గిరికొత్తపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

కడ్తాల్, మే 23: ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. గురువారం కడ్తాల్, మాడ్గుల్ మండలాల పరిధిలోని వాసుదేవ్‌పూర్, గిరికొత్తపల్లి గ్రామాల్లో గల ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న, అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని, పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు పనులను పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సరస్వతీ, ఎంపీవో వేజన్న, డీఈ శ్రీనివాస్, ఏఈలు పరమేశ్వర్, సూర్యవంశీ, ఎంఈవో సర్దార్‌నాయక్, మండల నోడల్ అధికారి జంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నెలాఖరులోగా పనులు పూర్తికావాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 23 (నమస్తే తెలంగాణ) : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను మే 31 తేదీలోపు పూర్తి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులపై గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా, మండల విద్యాశాఖ, ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా ఎంపికైన 1,309 పాఠశాలల్లో పనులను చేపట్టాల్సి ఉందని.. అందులో 423 పాఠశాలల్లో పనులు ప్రారంభించి మే 31 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లకు మరమ్మతులు, విద్యుత్తు పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రతి మండలానికీ మూడు చొప్పున పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతులు, వసతులను కల్పించాలన్నారు. సమావేశంలో డీఈవో సుశీందర్‌రావు, మండల స్థాయి అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తొద్దు..

బాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్, మే 23 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలో హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 16వేల బస్తాలు, 600 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం కురిసే వర్షాలకు వరి ధాన్యం తడవకుండా టార్పలిన్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లై డీఎం విజయలక్ష్మి, జిల్లా కోఆపరేటీవ్ అధికారి డీసీవో ధాత్రిదేవి, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎంకే రాథోడ్, తహసీల్దార్ రవీందర్‌దత్తు, హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఈవో లక్ష్మణ్, పీఎస్‌సీఎస్ ఇన్‌చార్జి సీవో డి.మల్లికార్జున్, సెంటర్ ఇన్‌చార్జి ఎ.చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కృష్ణా, రైతులు తదితరులు ఉన్నారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతిపద్మ

- గ్రామ పంచాయతీల్లో 40 రకాల రిజిస్టర్లను పక్కాగా నమోదు చేయాలి
- పాఠశాల పనుల్లో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలి
- పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతిపద్మ

పెద్దేముల్, మే 23 : గ్రామ పంచాయతీల పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతుల పనులను ఈ నెల 28వ తేదీలోపు అన్ని గ్రామాల్లో పూర్తయ్యే విధంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతిపద్మ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల వారీగా పలు అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, కంపోస్టు షెడ్డులు, క్రీడా ప్రాంగణాల నిర్వహణ, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడం, ప్రజలకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను ప్రతి రోజూ పక్కాగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనుల్లో భాగంగా ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచేలా, తాగునీరు సక్రమంగా అందేలా, మురుగు కాల్వలు, అంతర్గత రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కంపోస్టు షెడ్డుల్లో ఎరువుల తయారీ, తడి, పొడి చెత్త సేకరణ, మొక్కలకు నీరు పోయడం, గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు 40 రకాల వివిధ రిజిస్టర్లను పక్కాగా రికార్డు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మండల ఎంపీడీవో జర్నప్ప, ఇన్‌చార్జి ఎంపీవో రమేశ్‌కుమార్, ఏపీవో నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి

గ్రామాల్లో పర్యటించిన డీపీవో సురేశ్‌మోహన్

కడ్తాల్, మే 23: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సురేశ్ మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా పిరమిడ్ సమీపంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఎర్త్ షెల్టర్ వెంచర్‌ని సందర్శించి, అందులో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. 2008 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఇరవై ఐదు ఎకరాలకు సంబంధించిన అనధికార లేఅవుట్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు, సదరు వెంచర్‌ను ఆయన పరిశీలించారు. వెంచర్‌కి సంబంధించిన వివరాలను పంచాయతీ అధికారుల వద్ద నుంచి సేకరించారు. వెంచర్‌లో చేపట్టిన ఇండ్ల నిర్మాణాలు, వాటికిచ్చిన అనుమతుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీల తనిఖీలో భాగంగా అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, తడి, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీసీపీ అధికారి సువర్ణ, ఎంపీవో మధుసూదనాచారి, పంచాయతీ కార్యదర్శులు హరీశ్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఆమనగల్లు : విధుల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని రాంనూంతల గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డంపింగ్ యార్డ్, శ్మశానవాటిక, పల్లె ప్రకృతివనం, నర్సరీ, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీలను శుభ్రంగా ఉంచవలసిందిగా కార్యదర్శికి, ఎంపీవోను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శి బాలమల్లేశ్ ఉన్నారు.

భారత్, యూఎస్ ద్వైపాక్షిక వాణిజ్యం రూ.500 బిలియన్లు

యునైటెడ్ స్టేట్స్ కౌన్సిలర్ జనరల్ జెన్నీఫర్ లార్సన్

సదస్సులో మాట్లాడుతున్న జెన్నీఫర్ లార్సన్

ఖైరతాబాద్, మే 23: భారతదేశం, యూఎస్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రాబోవు ఐదేండ్లలో రూ.500 బిలియన్ల డాలర్లకు చేరుకోవచ్చని యునైటెడ్ స్టేట్స్ కౌన్సిలర్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని 'ది పార్క్' హోటల్‌లో 'గ్లోబల్ అలయెన్స్, స్ట్రెంథెనింగ్ ఎకనామిక్ బ్రిడ్జెస్' అనే అంశంపై గురువారం ద్వైపాక్షిక వాణిజ్య సమావేశం జరిగింది. ఎఫ్ఎల్‌వో వైర్ పర్సన్ ప్రియా గజ్జార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో లార్సన్ మాట్లాడారు. అమెరికాలో చదువుతున్న భారతీయుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతున్నదని, అమెరికాలోని భారతీయ విద్యార్థుల్లో 40 శాతం తెలుగువారేనన్నారు. యూఎస్ఏలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భాష తెలుగేనని పేర్కొన్నారు. బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ ఓవెన్ మాట్లాడుతూ, దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక మార్పిడి మన వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు దోహదపడుతాయన్నారు. ఈటెన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్ కమిషనర్ డేనీస్ మాట్లాడుతూ, గతేడాది ఆస్ట్రేలియన్ ప్రిమియర్ ఆంథోని అల్బనీస్ నేతృత్వంలోని వాణిజ్య బృందం భారత్‌కు రావడం ఎంతో కీలకమైనదన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, మే 23: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట సురభి వెంకటేశ్వరరావు ఉన్నారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మే 23 : జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం తన చాంబర్ లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగే సప్లిమెంటరీ పదవ తరగతి పరీక్షలు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో మొత్తం 25 పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎండాకాలం దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సమయానుకూలంగా బస్సులు నడపాలని ఆర్టీసి అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేటట్లుగా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యార్థులకు తగిన వైద్య సదుపాయాలు కల్పించాల్సిందిగా వైద్య శాఖా అధికారులకు సూచించారు. జూన్ 3 నుండి జూన్ 11 వరకు వరకు జరిగే పరీక్షలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశం లో డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యా శాఖా అధికారి రేణుకా దేవి, ట్రాన్స్ పోర్ట్ అధికారి జోషేఫ్ , మిషన్ భగీరథ అధికారి బాబు శ్రీనివాస్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

ఎం. ఫార్మసీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎం. ఫార్మసీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎం. ఫార్మసీ మొదటి, మూడో సెమిస్టర్, మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 6వ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎం.పీఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 31వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

బీసీఏ రివాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బీసీఏ రివాల్యుయేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. బీసీఏ సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశామని పేర్కొన్నారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రైతు పండుగకు వెళ్దాం

నేడు రాష్ట్రంలో విత్తన మేళా

వ్యవసాయ యూనివర్సిటీ, మే 23: రైతు వెయ్యి కళ్లతో ఎదురు చూసిన కాలానికి ప్రకృతి కరుణించింది. వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ చినుకులు రాలుతున్నాయి. సకాలంలో వానలుపడే అవకాశాలున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించడమే కాకుండా అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు. నాణ్యత గల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సమీప రైతులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంతో పాటు నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, జగిత్యాల, వరంగల్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రాలలో విత్తన మేళా ఏర్పాటు చేశారు. ఈ విత్తన మేళాకు పెద్ద ఎత్తున రైతులు హాజరై సాగు సమాచారంతో పాటు ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులతో మమేకం కానున్నారు. యూనివర్సిటీ ఆడిటోరియంలో విత్తన మేళాను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు పరిశోధనా సంచాలకులు, రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి తెలిపారు. ఈ మేళాలో వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సంస్థలు ఐఐఓఆర్, ఐఐఓఎంఆర్, ఐఐఆర్ఆర్, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలం, వ్యవసాయ, ఉద్యాన అనుబంధ శాఖల (టీఎస్ఎస్ డీసీ, ఎన్ఎస్ సీ, టీఎస్ఎస్ఓ సీఏ) పాల్గొనే ఈ విత్తన మేళా ఉదయం 10 గంటలకు ప్రారంభమై దినమంతా కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విత్తన మేళాలో 16 రకాల పంటలలో, 67 రకాలకు చెందిన దాదాపు 12 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులు కొనుక్కోవడానికి అందుబాటులో ఉంచనున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కల్పించటానికి వీలుగా వ్యవసాయ అనుబంధ రంగాలలో కూడిన వ్యవసాయ ప్రదర్శన కూడా అందుబాటులో ఉంటుంది. రైతు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ విత్తన మేళా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. ఈ మేళాలో విశ్వవిద్యాలయంలో రూపొందిచిన వివిధ వంగడాలు, వరిలో సన్నగింజ రకాలు, పలు రకాల విత్తనాలను అందుబాటులో ఉంచనున్నారు. పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను సైతం అందుబాటులో ఉంచుతున్నారు.

వర్సిటీ ప్రధాన కేంద్రం

ఫలించని చర్చలు..!

జీహెచ్ఎంసీలో ఉధృతమవుతున్న కాంట్రాక్టర్ల పోరు

రెండు నెలలకు సంబంధించి పేమెంట్స్ రిలీజ్ చేస్తామన్న ఈఎన్సీ జియావుద్దీన్

సిటీబ్యూరో, మే 23(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో కాంట్రాక్టర్ల పోరు రోజురోజుకూ ఉధృతమవుతున్నది. ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహణ పనులన్నీ నిలిపివేసి సమ్మెలోకి వచ్చి తమ నిరసన ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. రూ.1350 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేసేంత వరకూ నిర్వహణ పనులు చేపట్టబోమంటూ అల్టిమేటం జారీ చేసి.. 'వీ వాంట్ పేమెంట్స్' పేరుతో సమ్మె చేపడుతున్నారు. ఇందులో భాగంగానే గడిచిన ఆరు రోజులుగా రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు ఎక్కడికక్కడ నిల్వడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే మాన్‌సూన్ అత్యవసర పనులు ఐఆర్టీని నిలిపివేస్తామని జీహెచ్ఎంసీకి కాంట్రాక్టర్లు హెచ్చరించారు. దీనిపై కమిషనర్ రొనాల్డ్‌రాస్ సైతం కాంట్రాక్టర్లను నిధులు విడుదల సక్రమంగా జరుగుతున్నదని, ఐఆర్టీ పనులు నిలిపివేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే రూ.57కోట్లను విడుదల చేసిన జీహెచ్ఎంసీ...గురువారం కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో ఈఎన్సీ జియావుద్దీన్ సమావేశమయ్యారు. రెండు నెలలకు సంబంధించి పేమెంట్ రిలీజ్ చేస్తామని ఈఎన్సీ కాంట్రాక్టర్లకు తెలిపారు. ఇందుకు కాంట్రాక్టర్లు ససేమిరా అన్నారు. బకాయిలు మొత్తం చెల్లించే వరకు బంద్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. దీంతో అధికారులు, కాంట్రాక్టర్లు ఎవరికి తగ్గకుండా బెట్టు మీద ఉండటంతో రాబోయే వర్షాకాలంలో ఉత్పన్నమయ్యే సమస్యలపై ప్రజలు బిక్కుబిక్కుమంటున్న పరిస్థితి. రాబోయే రోజుల్లో ఈ కాంట్రాక్టర్ల సమస్యకు పరిష్కారం చూపకపోతే ప్రజా సమస్యలు ఎక్కువగా అయ్యే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతున్న తరుణంలో అధికారుల వైఖరీ ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.!!

ప్రథమ్ ఇండియాతో జతకట్టిన సీసీఎంబీ

శాస్త్ర, సాంకేతిక పరిశోధనలపై గ్రామీణ ప్రాంతాలకు అవగాహన

సిటీబ్యూరో, మే 23(నమస్తే తెలంగాణ): శాస్త్ర, సాంకేతిక పరిశోధనల ప్రాధాన్యతను పెంచేలా సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ కీలక నిర్ణయం తీసుకున్నది. బయాలజీ అధ్యయనంలో ముఖ్య భూమికను పోషిస్తున్న సీసీఎంబీ, డీఎన్ఏ, ప్లాంట్, సెల్ డీసీజ్‌తో పాటు అంతరించిపోతున్న జీవరాసులను పరిరక్షించేలా అధ్యయనాలు చేస్తోంది. ఈ క్రమంలో సీసీఎంబీ చేసే పరిశోధనలు, అధ్యయనాలకు విస్తృత ప్రాచుర్యం కలిగించి మారుమూల ప్రాంతాల్లోనూ శాస్త్రీయ పరిశోధనలపై అవగాహన, ఆసక్తిని పెంచేలా కృషి చేస్తున్నది. ఇందుకు ప్రథమ్ ఇండియాతో సీసీఎంబీ ఒప్పందం చేసుకోగా, గ్రామీణ ప్రాంతాలకు పరిశోధనలను వివరిస్తూ చిన్నారుల్లో అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలో ప్రథమ్ ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు సీసీఎంబీ చేసే పరిశోధనలు, అధ్యయనాలను ఆడియో, వీడియో రూపంలో వివరంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని సీసీఎంబీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ప్రథమ్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదిరినట్లుగా సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి.

సీడీఎఫ్‌డీ నోటిఫికేషన్ విడుదల

జూన్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలి

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): లైఫ్ సైన్సెస్ రంగంలో పారిశ్రామికవేత్తగా రాణించేందుకు ఔత్సాహికులకు సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నది. లైఫ్ సైన్సెస్ రంగంలో స్టార్టప్‌లను ప్రారంభించాలని భావించే వారికి సీడీఎఫ్‌డీ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో చేరేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ, హెల్త్ టెక్నాలజీ, మెడికల్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ, అగ్రికల్చర్ టెక్నాలజీ, బయోఇన్‌ఫర్మేటిక్స్ వంటి విభాగాల్లో స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ఇంక్యుబేషన్ సేవలు ప్రారంభించింది. సీడీఎఫ్డీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో చేరిన స్టార్టప్‌లకు కోవర్కింగ్ ల్యాబ్, ఆఫీస్ స్పేస్‌తోపాటు హై ఎండ్ ఎక్విప్‌మెంట్, ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, మెంటార్‌షిప్, నెట్‌వర్కింగ్ అండ్ మార్కెట్ లింకేజ్, ఫండ్ రైజింగ్ అసిస్టెంట్ వంటి సదుపాయాలను కల్పించనున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు జూన్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.